సాక్షి
ఖమ్మం

7

ఆదివారం । 26 । జనవరి । 2025

ప్రగతి బాటలో పయనం

రాజ్యాంగమే ఆధారంగా అందివస్తున్న పథకాలను జిల్లా వాసులు సద్వినియోగం చేసుకుంటున్నారు. గిరిజన, ఆదివాసీలు రుణాలు, పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధిస్తుండగా.. పలుచోట్ల గిరిజన రైతులు బంగారు పంటలు పండిస్తున్నారు. అంతేకాక దేశ భద్రతలో భాగంగా సైన్యంలోనూ పలువురు తమ సేవలందిస్తున్నారు. నేడు రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు...

- 8లో...



న్యూస్‌రీల్

హైకోర్టు జడ్జిగా జస్టిస్ తిరుమలాదేవి ప్రమాణం

- పెనుబల్లి మండలం తుమ్మలపల్లిలో హర్షాతిరేకాలు



హైకోర్టు జడ్జి ప్రమాణ స్వీకారం చేస్తున్న ఈడా తిరుమలదేవి

సత్తుపల్లి: హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ ఈడా తిరుమలదేవితో శనివారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ శనివారం ప్రమాణం చేయించారు. సంగారెడ్డికి చెందిన జస్టిస్ తిరుమలాదేవికి పెనుబల్లి మండలం తుమ్మలపల్లికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు ఈడా చెన్నయ్య కుమారుడు శేషగిరిరావుతో 1988లో వివాహం జరిగింది. హైదరాబాద్‌లో లా చదివిన ఆమె హైదరాబాద్ సిటీ కోర్టు, హైకోర్టుల్లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశాక 2012లో నిజామాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం ఖమ్మం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, వరంగల్, హైదరాబాద్ మెట్రోపాలిషన్ సెషన్ కోర్టు న్యాయమూర్తిగా పనిచేసి పలు కీలక కేసుల్లో తీర్పు ఇచ్చారు. అనంతరం తెలంగాణ జ్యూడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించగా, హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా పెనుబల్లి మండలం తుమ్మలపల్లి వాసులు హర్షం వ్యక్తం చేశారు.

జలవనరుల శాఖ ఇన్‌చార్జ్ సీఈగా రమేష్‌బాబు




ఖమ్మంఅర్బన్: ఖమ్మం జలవనరులశాఖ సీఈగా సూర్యాపేట సీఈ(చీఫ్ ఇంజనీర్) వి.రమేష్‌బాబుకు అదనపు బాధ్యతలు ఇస్తూ శనివారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం సీఈగా ఉన్న గత నెల 31న విద్యాసాగర్ ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుండి సీఈగా ఎవరినీ నియమించకపోగా, జిల్లాలో జలవనరుల శాఖ ఆధ్వర్యాన భారీగా పనులు జరుగుతున్న నేపథ్యాన పోస్టు కోసం తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలిసింది. ఇంతలోనే పనుల పర్యవేక్షణకు ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా సూర్యాపేట సీఈకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ



బహుమతి సాధించిన విద్యార్థులు, గైడ్‌టీచర్లు

ఏన్కూరు: పుదుచ్చేరిలో ఈనెల 21నుంచి 25వ తేదీ వరకు జరిగిన దక్షిణ భారతదేశ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఏన్కూరు మండలం బురదరాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తెలంగాణ నుంచి గ్రూప్ విభాగంలో విద్యార్థులు కె.మహిమ, ఎస్.కే.షాహిద్ పాషా, గైడ్ టీచర్లు, సాగి సుజాత, పొట్ట రామారావు ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. గణిత విభాగంలో 'విజువలైజింగ్ మ్యాథ్స్ మోడల్స్ అండ్ అప్లికేషన్స్' అంశంపై ప్రాజెక్టు సమర్పించగా బహుమతి లభించింది.



రాజ్యాంగం అమల్లోకి వచ్చి నేటితో 75ఏళ్లు నిండనున్నాయి. 1953 అక్టోబర్ 1న పూర్వ ఖమ్మం జిల్లా ఆవిర్భవించగా రాజ్యాంగమే ఆలంబనగా ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలతో దశలవారీగా జిల్లా అభివృద్ధిలో ముందుకు సాగుతోంది. రాజ్యాంగంలో పొందుపర్చబడిన అనేక అంశాలు ఇందుకు దోహదపడగా.. రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల సాయంతో జిల్లాలో పేద వర్గాలకు మేలు జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలతో పేదలకు ఊరట లభిస్తోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

రాజ్యాంగమే దిక్సూచిగా..

- 70 ఏళ్లలో జిల్లా పురోభివృద్ధిలో కొత్త పుంతలు
- అట్టడుగు, అణగారిన వర్గాలకు అండగా ప్రభుత్వాలు
- సంక్షేమ పథకాలతో పేదలకు మెరుగైన జీవితం

నేడు రాజ్యాంగ అవతరణ దినోత్సవం

జిల్లా జనాభా	14,27,438
హిందువులు	13,06,058
ముస్లింలు	99,777
క్రిస్టియన్లు	17,859
సిక్కులు	1,094
జైనులు	86
బుద్ధిస్టులు	50
పథకాలతో లబ్ధి	
ఎస్సీలు	3,09,918 మంది
ఎస్టీలు	2,10,319
బీసీలు	6,21,611
ఇతరులు	2,85,590
ప్రధాన పంటలు	వరి, పత్తి, చెరకు, మొక్కజొన్న, మిర్చి, మామిడి, కూరగాయలు
ప్రధాన పరిశ్రమ	గ్రానైట్

ఆ దశ నుంచి..

పూర్వ ఖమ్మం జిల్లా పరిశ్రమలు, అటవీ సంపద, వ్యవసాయం ప్రధాన వనరుగా విరాజిల్లింది. 2016లో జిల్లా విడిపోయి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెంగా ఏర్పడడంతో పరిశ్రమలు, అటవీ విస్తీర్ణాన్ని కోల్పోవాల్సి వచ్చింది. అయినా కొత్త ఉత్సాహంతో జిల్లా ముందుకు పురోగమించింది. ప్రస్తుతం జిల్లా విస్తీర్ణంలో 68.08 శాతం సాగులో ఉండటం విశేషం. ప్రభుత్వాలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తుండడంతో అభివృద్ధిలో హైదరాబాద్, వరంగల్ జిల్లాల తర్వాత స్థానంలో నిలుస్తోంది. 2014 సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం జిల్లా జనాభా 14,27,438 కాగా.. ఇక్కడ వరి, పత్తి, చెరకు, మొక్కజొన్నతోపాటు మిర్చి, మామిడి, సపోట, నిమ్మ, కూరగాయల పంటలు సాగవుతున్నాయి. అలాగే, జిల్లాలో విస్తరించిన గ్రానైట్ పరిశ్రమ ద్వారా ఇతర రాష్ట్రాల వారికీ ఉపాధి లభిస్తోంది.

స్వేచ్ఛ, సమానత్వం

భారత రాజ్యాంగంలో ప్రధానంగా స్వేచ్ఛ, సమానత్వం, భావ ప్రకటన స్వేచ్ఛ అనే అంశాలను పొందుపరిచారు. జిల్లాలో హిందువులు 13,06,058 మంది ఉండగా.. ముస్లింలు 99,777, క్రిస్టియన్లు 17,859 మందితో పాటు సిక్కులు, జైనులు, బుద్ధిస్టులు నివసిస్తున్నారు. వీరంతా వారివారి మతవిశ్వాసాలకు తగ్గట్టుగా జీవించేలా జిల్లాలో వాతావరణం ఉంటుంది. అన్ని పండుగలను ఉత్సాహకరమైన వాతారణంలో నిర్వహించుకోవడం సంప్రదాయంగా వస్తోంది.

గ్రామపంచాయతీలకు నిధులు..

అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం ప్రభుత్వాలు రంగాల వారీగా నిధులు కేటాయిస్తున్నాయి. దేశానికి పట్టుగొమ్మలుగా ఉండే గ్రామపంచాయతీల పరిధిలో పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించేలా రాజ్యాంగంలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఏయే రంగాలకు ఎంత మేర నిధులు ఇవ్వాలి, నిధుల సేకరణపై రాజ్యాంగంలో పూర్తిస్థాయిలో వివరించారు. జిల్లాలో ప్రస్తుతం 589 గ్రామపంచాయతీలు ఉండగా.. ప్రస్తుతం ఇవన్నీ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయి. మ్యాచింగ్ గ్రాంట్, రాష్ట్ర, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు, జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు విడుదలవుతున్నాయి. అలాగే పన్నుల రూపంలో వసూలయ్యే నిధులతో స్థానికంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు వీలవుతోంది.

పేదలకు 'సంక్షేమం'

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి చేయూతనివ్వాలన్నది రాజ్యాంగంలో పేర్కొన్న ఒక అంశం. ఆ సూచన మేరకు పలు రంగాల్లో రిజర్వేషన్ల విధానం అమలవుతోంది. విద్య, వైద్యం, ఉద్యోగాల్లో ప్రభుత్వాలు ఈ విధానాన్ని అమలుచేస్తున్నాయి. ఇక ఆర్థికంగా తోడ్పాటునందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తుండగా, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నాయి. అలాగే సామాజిక పింఛన్లు, నిరుపేదలకు ఇళ్ల పథకాలతో లబ్ధి జరుగుతోంది. ఫీజు రీయింబర్స్ పథకం ద్వారా అనేకమంది పేద విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో పాటు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా గురుకులాలను నిర్వహిస్తుండడంతో నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోంది. అనేక పథకాల ద్వారా జిల్లాలోని 3,09,918 మంది ఎస్సీలు, 2,10,319 మంది ఎస్టీలు, 6,21,611 మంది బీసీలకు అలాగే 2,85,590 మంది ఇతరులకు లబ్ధి కలుగుతోంది.

పథకాలకు నేడు శ్రీకారం

- పైలట్‌గా మండలానికి ఒక గ్రామం ఎంపిక
- రాత్రి పొద్దుపోయే వరకు సర్వే చేసిన అధికారులు
- చిన్నగోపతి సభకు హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి



ఖమ్మం 26వ డివిజన్‌లో సర్వే చేస్తున్న ఉద్యోగులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం రాష్ట్రప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకాలకు శ్రీకారం చుట్టనుంది. ఈనేపథ్యాన పైలట్‌గా జిల్లాలో 20 మండలాల నుంచి ఒక్కో గ్రామంలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేయనున్నారు. అయితే, ఖమ్మం కార్పొరేషన్, మున్సిపాలిటీల్లోనూ ఒక్కో వార్డులో లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తామని ప్రకటించినా ఆతర్వాత వాయిదా వేసినట్లు తెలిసింది. ఎంపిక చేసిన గ్రామాలు, వార్డుల్లో అర్హులైన లబ్ధిదారుల జాబితా ప్రకటించి కొందరికి లాంఛనంగా మంజూరు పత్రాలు అందజేస్తారు. జిల్లాలోని కొణిజర్ల మండలం చిన్నగోపతిలో జరిగే సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొని లబ్ధిదారులకు పత్రాలు అందజేయనున్నారు.

ఏయే గ్రామాల్లో...

పైలట్ ప్రాజెక్టుగా ఆదివారం లబ్ధిదారులకు కొందరికి చొప్పున పథకాల ప్రొసీడింగ్స్ అందజేసే గ్రామాల వివరాలను అధికారులు వెల్లడించారు. కూసుమంచి మండలంలో ధర్మతండా, ఖమ్మం రూరల్‌లో ఆరెంపుల, నేలకొండపల్లిలో కొంగర, తిరుమలాయపాలెంలో ఏలువారిగూడెం, రఘునాథపాలెంలో మల్లేపల్లి, బోనకల్‌లో గార్లపాడు, ఎర్రుపాలెంలో రాజులదేవరపాడు, చింతకాని రేపల్లెవాడ, మధిరలో చిలుకూరు, ముదిగొండలో ఖానాపురం, ఏన్కూరులో రేపల్లెవాడ గ్రామాలను ఎంపిక చేశారు.అలాగే, వైరా మండలంలో పుణ్యపురం, కొణిజర్లలో చిన్నగోపతి, సింగరేణిలో కొత్త తండా, కామేపల్లిలో పొన్నెకల్, వేంసూరులో చిన్నమల్లెల, పెనుబల్లిలో రామచంద్రాపురం, కల్లూరు తూర్పు లోకవరం, సత్తుపల్లిలో కొత్తూరు, తల్లాడ కొడవటిమెట్ట గ్రామాలను ఎంపిక చేయగా శనివారం రాత్రి పొద్దుపోయే వరకు ఆయా గ్రామాల్లో అధికారులు సర్వే చేపట్టారు.

చిన్నగోపతిలో డిప్యూటీ సీఎం

కొణిజర్ల: మండలంలోని చిన్నగోపతిలో లబ్ధిదారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం పథకాల మంజూరుపత్రాలు అందజేయనున్నారు. గ్రామంలో 47మందికి ఇందిరమ్మ ఇళ్లు, 81మంది ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 41మందికి కొత్త రేషన్ కార్డుల మంజూరు పత్రాలు అందజేయనుండగా డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ రోజారాణి, ఎంపీఓ రాజేశ్వరి, తహసీల్దార్ రాము, ఏసీపీ ఎం.ఏ.రహమాన్ ఏర్పాట్లను శనివారం పరిశీలించారు.

కేఎంసీలో అస్పష్టత

ఖమ్మంమయూరిసెంటర్: నాలుగు పథకాల మంజూరు పత్రాలను ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్‌లో అందచేయనున్నట్లు అధికారులు శనివారం ప్రకటించారు. ఈమేరకు సాయంత్రం నుంచి అధికారులు సర్వే మొదలుపెట్టారు. పాత దరఖాస్తుల ఆధారంగా ఇప్పటికే లబ్ధిదారులను ప్రకటించగా ఇటీవల అందిన 590దరఖాస్తుల పరిశీలనకు 40 మంది ఉద్యోగులు రంగంలోకి దిగారు. కొద్దిసేపటికి ఏమైందో కానీ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయంటూ ఉద్యోగులు వెనుదిరిగారు. దీంతో కేఎంసీ పరిధిలో పథకాలకు మంజూరు పత్రాల పంపిణీ ఉంటుందా, లేదా అన్నది తెలియరాలేదు.

పకడ్బందీ ఏర్పాట్లు

ఖమ్మంసహకారనగర్: నాలుగు నూతన పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. ప్రతీ మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో నాలుగు పథకాల పత్రాలు అందజేయాలని, గతంలో ఎంపిక చేసిన వారే కాక ఇటీవల సభల్లో అందిన దరఖాస్తుల ఆధారంగా అర్హులు ఉంటే లబ్ధిదారులను గుర్తించాలని తెలిపారు. ఈమేరకు జరిగే సమావేశాల్లో మంజూరు పత్రాలు ఇవ్వడమే కాక దరఖాస్తుల ప్రక్రియ, ఎంపికపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రతీ మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ శ్రీజ, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీఏఓ డి.పుల్లయ్య, డీఎస్ఓ చందన్‌కుమార్, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ జి.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వమే మంచి పద్ధతి

- కేసుల సత్వర పరిష్కారానికి అంతా కృషి చేయాలి
- నూతన కోర్టుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జస్టిస్ శ్రీసుధ



మాట్లాడుతున్న జస్టిస్ శ్రీసుధ, వేదికపై జస్టిస్ నగేష్, జస్టిస్ శరత్, జిల్లా జడ్జి రాజగోపాల్ తదితరులు

ఖమ్మంలీగల్: మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం మంచి పద్ధతి అని హైకోర్టు జడ్జి, ఖమ్మం పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ శ్రీసుధ తెలిపారు. ఖమ్మం న్యాయస్థానాల సముదాయంలో ఏర్పాటు చేసిన రెండో అదనపు సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు, అడిషనల్ సెషన్స్ జడ్జి కోర్టులను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ భీమపాక నగేష్, జస్టిస్ కాజా శరత్‌తో కలిసి ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ శ్రీసుధ మాట్లాడుతూ పేదలు, కక్షిదారులకు న్యాయసాయం అందించేందుకు న్యాయవ్యవస్థలోని అంతా పనిచేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పరిష్కార పద్ధతి అయిన మధ్యవర్తిత్వంతో ఎక్కువ కేసులు పరిష్కరించడం ద్వారా గ్రామస్థాయిలో మానవ సంబంధాలు పెంపొందించడంతో పాటు శాంతియుత వాతావరణం నెలకొల్పొచ్చని తెలిపారు. అలాగే, జ్యూడీషియల్ సిబ్బందికి పునశ్చరణ తరగతులను నిర్వహించి వారిలో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించాలని సూచించారు. నూతన కోర్టులకు కావాల్సిన సిబ్బందిని నియమిస్తామని, ప్రస్తుతం 1,700 పోస్టులు భర్తీ చేస్తున్నామని వివరించారు. అనంతరం జస్టిస్ కాజా శరత్ మాట్లాడుతూ అదనపు కోర్టులతో పాటు న్యాయమూర్తుల నియామకం, సిబ్బంది కేటాయింపుతో ఎక్కువ కేసులు పరిష్కరించడానికి ప్రయత్నిస్తామన్నారు. జస్టిస్ భీమపాక నగేష్ మాట్లాడుతూ న్యాయవాదులు తెలుగులో వాదనలు వినిపిస్తూ భాషా ప్రాధాన్యతను పెంచాలని, కక్షిదారుల మనసెరిగి వారికి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. బార్ కౌన్సిల్ మెంబర్ కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ జ్యూడీషియల్ క్వార్టర్లకు కేటాయించిన మూడెకరాల స్థలంలో జ్యూడీషియల్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్ మాట్లాడగా హైకోర్టు న్యాయమూర్తులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, న్యాయమూర్తులు అర్చనాకుమారి, కె.ఉమాదేవి, వి.అపర్ణ, జి.రాంప్రసాద్‌రావు, శీనయ్య, బి.నాగలక్ష్మి, కె.దీప, బి.రజని, ఏ.బిందుప్రియ, వి.మాధవి, ఆర్.శాంతిలత, కార్తీక్, ఎం.కల్పన, వి.శివరంజని, బార్ అసోసియేషన్ కార్యదర్శి చింతనిప్పు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పదిహేను రోజులకే పొట్టకొచ్చిన వరి

- వందలాది ఎకరాల్లో సాగుచేసిన రైతుల్లో ఆందోళన
- పరిశీలించిన ఏఓ, త్వరలో శాస్త్రవేత్తలు వస్తారని వెల్లడి



వరి పైరులో రైతులు



ముప్పై రోజులకే ఈనే దశకు చేరిన వరి పంట

సత్తుపల్లిరూరల్: వరి నాట్లు వేసిన 60 నుంచి 70 రోజుల వ్యవధిలో వరి కంకులు ఈనే దశకు చేరతాయి. కానీ సత్తుపల్లి మండలంలో వందలాది ఎకరాల్లో రైతులు సాగుచేసిన వంగడం పదిహేను రోజుల్లోనే 30 నుంచి 40శాతం వరకు ఈనే దశకు రావడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలోని రేజర్లకు చెందిన పలువురు రైతులు తెలంగాణ ఆగ్రో ఏజెన్సీలో మంగళ సీడ్స్‌కు ఓ కంపెనీకి చెందిన ఆర్‌ఎన్‌ఆర్ 15048 వరి రకం విత్తనాలు కొనుగోలు చేశారు. అయితే, ఈ పంట 60 రోజులకు ఈనె దశకు చేరాల్సి ఉండగా పదిహేను రోజులకే పొట్ట దశకు చేరగా 30 – 35 రోజులకే కంకులు వేస్తుండడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు లబోదిబోమంటున్నారు. పంట మొత్తం ఒకేసారి పొట్ట దశలోకి రావటం లేదని, కొంత మేర పొట్ట దశలో, మరికొంత ఈనె దశలో ఉండడంతో కంకులు రాలిపోయే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఇప్పటివరకు ఎకరాకు రూ.30వేలకు పైగా వెచ్చించిన తమకు తీరని నష్టం ఎదురవుతుందని ఆందోళన చెందుతున్నారు. పలువురు రైతులు పదికి ఎకరాల్లో ఈ రకం సాగు చేయగా సత్తుపల్లి మండలంలో వందలాది ఎకరాల్లో సాగైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యాన రేజర్లకు చెందిన రైతులు గొర్ల అంజిరెడ్డి, భీమిరెడ్డి నర్సారెడ్డి, పులగం అంజిరెడ్డి తదితరుల ఫిర్యాదుతో సత్తుపల్లి ఏఓ వై.శ్రీనివాసరావు శనివారం పంటలను పరిశీలించారు. వాతావరణ పరిస్థితుల కారణంగానే వరి కంకులు ముందుగానే వచ్చాయని తెలిపారు. నమూనాలను పరిశీలన నిమిత్తం శాస్త్రవేత్తలకు పంపించామని, త్వరలోనే శాస్త్రవేత్తలు పరిశీలించి పూర్తి వివరాలు వెల్లడిస్తారని పేర్కొన్నారు. కాగా, రైతులు మాత్రం కల్తీ విత్తనాలతోనే ఇలా జరిగిందని చెబుతూ తమకు పరిహారం ఇప్పించాలని కోరారు.

గణతంత్ర వేడుకలకు సిద్ధం..

గణతంత్ర దినోత్సవ వేడుకలకు పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 9గంటలకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. కలెక్టర్ ప్రసంగం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాల పంపిణీ ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా పరేడ్ మైదానంలో ఏర్పాట్లు చేశారు.

- ఖమ్మం సహకారనగర్



పోలీస్ పరేడ్ మైదానంలో రంగులు అద్దుతున్న ఉద్యోగులు

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

- ఆ సమయం ప్రాక్టీస్‌కు కేటాయించాలి
- అర్జున అవార్డు గ్రహీత ఎన్.సిక్కిరెడ్డి



మాట్లాడుతున్న సిక్కిరెడ్డి, పక్కన డీవైఎస్ఓ, అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: క్రీడాకారులు సోషల్ మీడియాకు ఎక్కువ సమయం కేటాయించకుండా ప్రాక్టీస్‌పై దృష్టి సారిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత ఎన్.సిక్కిరెడ్డి సూచించారు. శనివారం ఖమ్మం వచ్చిన ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. సోషల్ మీడియా ప్రభావంతో యువత చెడు మార్గాల్లోకి వెళ్తోందని తెలిపారు. క్రీడల్లో రాణించేగలిగే సత్తా ఉన్న వారు కూడా అధిక సమయం సెల్ ఫోన్‌కు కేటాయించడంతో ఏకాగ్రత దెబ్బతింటోందన్నారు. ఈమేరకు ప్రతీ క్రీడాకారుడు కనీసం 8గంటలు నిద్రపోవడంతో పాటు ఫోన్, సోషల్ మీడియాకు వెచ్చించే సమయాన్ని తగ్గించాలని సూచించారు. ప్రస్తుతం తాను ప్రపంచ బ్యాడ్మింటన్ పోటీలకు సిద్ధమవుతుండగా తన బ్యాడ్మింటన్ అకాడమీలో చిన్నారులను అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దేలా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఖమ్మంతో తనకు ఎంతో అనుబంధం ఉందని, ఇక్కడ జరిగిన చాలా టోర్నీలకు హాజరయ్యానని సిక్కిరెడ్డి గుర్తు చేసుకున్నారు.

ఘనంగా సన్మానం

అర్జున అవార్డు గ్రహీత ఎన్.సిక్కిరెడ్డిని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన పటేల్ స్టేడియంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆమె క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ రోజూ ఎన్ని పనులు ఉన్నా ప్రాక్టీస్ మానొద్దని, తద్వారా ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. కోచ్ సూచనలు పాటిస్తూ ముందుకు సాగాలని తెలిపారు. డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సిరిపురపు సుదర్శన్, రిటైర్డ్ ఏఎస్పీ బాలకిషన్‌రావు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎన్.ఉప్పల్ రెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్ అసోసియేషన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటే బలమైన ఆయుధం



పోటీల్లో విజేతకు బహుమతి అందజేస్తున్న అధికారులు

ఖమ్మంసహకారనగర్: ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని అధికారులు తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం ఖమ్మం మెడికల్ కళాశాల నుంచి పాత బస్టాండ్ వరకు ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించడంతో పాటు అక్కడ మానవహారం ఏర్పాటుచేశారు. ఆతర్వాత భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన వేడుకల్లో సీనియర్ సిటిజన్లను సన్మానించడమే కాక కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. అలాగే, పోటీలకు విజేతలకు బహుమతులు అందజేశారు. డీఈఓ సోమశేఖరశర్మ, డీఐఈఓ రవిబాబు, డీవైఎస్ఓ సునీల్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.

ఓ వైపు ప్రగతి..

- మరో వైపు పడిపోతున్న నైతికత
- సీనియర్ సిటిజన్ తాళ్లూరి పంచాక్షరయ్య


తాళ్లూరి పంచాక్షరయ్య

బూర్గంపాడు: రాజ్యాంగానికి 75 ఏళ్లు నిండనున్నాయి. రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు ప్రత్యక్షంగా ఆ సంబురాల్లో పాలుపంచుకున్న బూర్గంపాడు మండలం ఇరవెండికి తాళ్లూరి పంచాక్షరయ్యకు ప్రస్తుతం 93ఏళ్లు నిండాయి. ఆయన వెల్లడించిన వివరాలు పంచాక్షరయ్య మాటల్లోనే..

అణగారిన వర్గాలకు ఊరట

రాజ్యాంగం అమలైన తొలి 25 ఏళ్లలో అణగారిన వర్గాలకు కొంతమేర ఊరట లభించింది. అప్పటి వరకు వెట్టిచాకిరీలో మగ్గిన వర్గాలు స్వశక్తితో జీవనోపాధులను మెరుగుపరుచుకున్నాయి. సంప్రదాయ వ్యవసాయ పంటల స్థానంలో మిర్చి, పొగాకు, పత్తి, పసుపు సాగు మొదలైంది. ఆ తర్వాత 25 ఏళ్లలో దిగుబడులు పెంచుకునేందుకు ఎరువులు, పురుగుమందుల వినియోగం పెరిగింది. దీంతో దిగుబడులతో పాటు మందుల అవశేషాలు పెరుగుతున్నాయి. గత 25 ఏళ్లలో వ్యవసాయ రంగంలో శాస్త్ర సాంకేతికత మరింతగా పెరిగింది. దిగుబడులు గతంలో కంటే రెట్టింపు స్థాయికి చేరాయి. అదే సమయంలో పంట ఉత్పత్తుల్లో నాణ్యత, స్వచ్ఛత లోపించాయి. వ్యవసాయ రంగంలో 75శాతం మేర యాంత్రీకరణ మొదలైంది.

అనేక మార్పులు

విద్యారంగంలో చాలా మార్పులు వచ్చినా చదువుకుని ఉద్యోగాలు సంపాదించి డబ్బు సంపాదించాలనే ఆతృత యువతలో కనిపిస్తోంది. ప్రతీ ఒక్కరి లక్ష్యం డబ్బు సంపాదనే. నైతి కమా... అనైతికమా అనేది పట్టించుకోవడం లేదు. ఈక్రమంలో మోసాలు, నేరాలు పెరగగా.. ఒకరి ఎదుగుదల మరొకరు తట్టుకోలేకపోతున్నారు.

విలువలు దిగజారాయి

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పరిపాలన సాగుతోంది. స్వార్థ ప్రయోజనాల కోసం పాలకులు ఎంతకైనా తెగిస్తుండగా రాజకీయాల్లో విలువలు దిగజారాయి. అధికారం కోసం అంతా అడ్డదారులు తొక్కుతున్నారు. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు సమైక్యత స్ఫూర్తి కొరవడుతోంది. దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తున్నా నైతిక విలువలు పడిపోవటం బాధ కలిగిస్తోంది. ప్రపంచంలోనే భారతదేశాన్ని ఆదర్శంగా చెప్పుకుంటున్నందున ఇప్పుడా పరిస్థితి మారకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

ఉన్న వనరులతోనే ఉపాధి..

- ఆర్థికంగా ఎదుగుతున్న ఆదివాసీ మహిళలు
- బీడు భూముల్లో రెండు పంటలు పండిస్తున్న రైతులు
- ఆదాయం పెంచుకుంటూ కుటుంబాల బలోపేతం

ఉద్యోగాలు రాలేదని పట్టభద్రులు.. రుణాలు ఇవ్వలేదని నిరుద్యోగులు నిత్యం ఆవేదన చెందుతుంటారు. పనిలో పనిగా పాలకులను తూలనాడుతుంటారు. కానీ75 ఏళ్ల గణతంత్ర భారతావనిలో ప్రభుత్వ సాయానికి తోడు.. ఉన్న వనరులనే సద్వినియోగం చేసుకుంటూ.. జీవనోపాధి పొందుతున్నారు. మరి కొందరికి పని కల్పిస్తున్నారు. వారిలో పట్టభద్రులూ, పట్టాలు లేనివారూ ఉన్నారు. ఏజెన్సీ ఆదివాసీ మహిళలు, గిరిజన రైతులు స్వశక్తితో ఆదాయం పొందుతున్నారు. సర్కారు నుంచి అందే సాయమే ఆలంబనగా ప్రగతి పథంలో పయనిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. గణతంత్ర వజ్రోత్సవాల సందర్భంగా వారిలో కొందరి గురించి తెలుసుకుందాం.


సంప్రదాయ ముడిసరుకులతో ఉత్పత్తులు చేస్తున్న లడ్డూలు తయారు చేస్తున్న గిరిజనులు

ఆదివాసీ సంప్రదాయ వంటలతో ఆదాయం..

భద్రాచలం: ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజన మహిళలు సమష్టిగా స్వయం ఉపాధి మార్గాల వైపు పయనిస్తున్నారు. అందుబాటులో ఉన్న వనరులనే సద్వినియోగం చేసుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెరిగిన నేపథ్యంలో గిరిజన మహిళలు మిల్లెట్స్‌తో వంటకాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. జజ్జర్ల సమ్మక్క, ఊకా వెంకట కృష్ణ, వెంకటలక్ష్మి, తాటి లలిత, సోయం మంగవేణిలు గ్రూపుగా ఏర్పడి ఐటీడీఏ నుంచి రుణం పొంది చిన్నతరహా పరిశ్రమ ఏర్పాటు చేశారు. అది ఆశాజనంగా లేకపోవడంతో సామలు, రాగి, జొన్న వంటి ఆదివాసీ సంప్రదాయ పంటలతో భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్ పేరుతో బిస్కెట్ల తయారీ మొదలుపెట్టారు. ఐటీడీఏ అధికారులు కార్యాలయ ఆవరణలోనే బిస్కెట్ల తయారీకి ఓ భవనంలో అవకాశం కల్పించారు. అమ్మకాలకు తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో షట్టర్ కేటాయించారు. దేవస్థానం వద్ద కూడా విక్రయాలు జరుపుతున్నారు. ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు ఐటీడీఏ అధికారులు సహకరించాలని గ్రూప్ సభ్యురాలు జజ్జర్ల సమ్మక్క కోరుతోంది.

అటవీ ఉత్పత్తులతో..

గిరిజన మహిళలు కొండ్రు సుధారాణి, రామలక్ష్మి, అట్టం కమల, సిడియం కమల, వసుంధర, హర్షిణి, విజయ దుర్గా, శీలం దుర్గ ఓం శక్తి మల్టీ ప్రొడక్ట్స్ పేరిట ఓ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. ఏపీలోని చింతూరులో జరిగే సంతలో ఆదివాసీ సంప్రదాయ పంటలు, ఉత్పత్తులు కొనుగోలు చేసి, బయట ప్రపంచానికి విక్రయిస్తున్నారు. ఇప్పపువ్వ లడ్డూ, ఆనె గింజలు, నువ్వులు, రాగి లడ్డూలు తయారు చేసి విక్రయిస్తున్నారు. తేనె కూడా అమ్ముతున్నారు. అంబలి, కొవ్వొత్తులు, సర్ఫ్ తదితర వస్తువులను కూడా తయారు చేసి విక్రయిస్తున్నారు. మహాబీర గింజలు, తానికాయ, కుంకుడుకాయ తదితర గింజలను అమ్ముతున్నారు. ఆదివాసీ వంటలను భద్రాచలం వచ్చే వీఐపీలకు రుచి చూపిస్తున్నారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూడకుండా అందుబాటులో ఉన్న వనరులను ఆదాయ మార్గాలుగా మార్చుకున్నారు. సీఆర్‌పీఎఫ్ వాళ్ల ద్వారా కొవ్వొత్తులు, ఫినాయిల్ తయారీలో తీసుకున్న శిక్షణ స్వయం ఉపాధికి దోహదపడిందని నిర్వాహకురాలు కొండ్రు సుధారాణి తెలిపారు.


మిల్లెట్ బిస్కెట్లు విక్రయిస్తున్న జజ్జర్ల సమ్మక్క


మిల్లెట్స్‌తో అల్పాహారం తయారు చేస్తున్న మడకం భారతి

మిల్లెట్స్ టిఫిన్

ఆరోగ్య పరిరక్షణకు మిల్లెట్స్‌తో తయారు చేసిన అల్పాహారం అందించేందుకు 'న్యూట్రి మిల్లెట్ హబ్', అరకు కాఫీ పౌడర్‌తో 'కాఫీ హౌస్'ను భద్రాచలంలో ఏర్పాటు చేశారు. రాగి కుడుములు, జొన్న కుడుములు, కువిముల లడ్డూ, రాగి పకోడి, రాగి ఇడ్లీ, సజ్జల దోశ, జొన్న దోశ, జొన్న రోటీ, సామల దోశలను విక్రయిస్తున్నారు. పీజీ పట్టభద్రుడైన పాయం రాజేంద్రప్రసాద్ ఆదివాసీ వంటలపై ఫెలోషిప్ సైతం తీసుకున్నాడు. 2017 నుంచి కోయ క్యూజిన్ పేరుతో మడకం భారతి, మరో పది మంది సభ్యులతో కలిసి భద్రాచలంలో అల్పాహారం విక్రయిస్తున్నారు. అస్సాం టీ, అరకు, బెంగళూరు కాఫీ, ఇప్ప పువ్వు టీ, కరకాయ టీలను ప్రజలకు, భక్తులకు అందుబాటులోకి తీసుకొని వచ్చారు. ప్రభుత్వ సాయం ఆశించకుండా స్వశక్తితో స్వయం ఉపాధి పొందుతున్నారు.

దేశరక్షణలో గొల్లెనపహాడ్

- అమరనేని మురళి స్ఫూర్తితో 20 మంది సైన్యంలోకి..

వైరా: సాధారణంగా గ్రామాలంటే రైతులు, ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలు ఉండడం సహజంగా చూస్తుంటాం. కానీ భారత సైన్యంలో ఆ గ్రామ యువత గత 20 ఏళ్లుగా తమ వంతు కర్తవ్యంగా పని చేస్తున్నారు. ఆ గ్రామమే ఖమ్మం జిల్లాలోని వైరా మండలం గొల్లెనపహాడ్.


గొల్లెనపాడు గ్రామ వ్యూ

వ్యవసాయ ఆధారిత కుటుంబాలే..

గొల్లెనపహాడ్‌లో జనాభా సుమారు 1,760 మంది ఉండగా, అన్నీ వ్యవసాయ ఆధారిత కుటుంబాలే. తొలిసారి అమరనేని మురళి దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో 1984లో సైన్యంలో చేరారు. 17 ఏళ్ల పాటు దేశ సరిహద్దులో జవాన్‌గా పని చేసి 1999లో కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నారు. 2002లో ఆర్మీ నుంచి రిటైర్డ్ అయిన మురళి ప్రస్తుతం ఎస్‌బీఐలో గార్డుగా పని చేస్తున్నారు.

చిన్న వయస్సు నుండే దేశభక్తి



యువత చిన్న వయసు నుంచే దేశం పట్ల భక్తి భావాలు పెంచుకోవాలి. ప్రతి ఒక్కరు మాతృభూమికి ఎంతోకొంత సేవ చేయాలి అనే తపన కలిగి ఉండాలి. అదే భావనతో సైనికుడిగా పని చేస్తున్నాను. దేశ సేవలో ఎంతో సంతృప్తి ఉంది. భారత సైనికుడిగా పని చేయడం అదృష్టం.
– కంచర్ల ప్రసాద్, సైనికుడు

దేశ సరిహద్దులో చిరస్థాయిగా..



దేశరక్షణ కోసం పలువురు యువకులు ఆర్మీలో చేరి గొల్లెనపహాడ్ పేరును దేశ సరిహద్దులో చిరస్థాయిగా నిలిపారు. జవాన్లుగా పని చేస్తున్న వారిని ఆదర్శంగా తీసుకుని గ్రామానికి చెందిన పలువురు యువకులు సైన్యంలో చేరేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు.
– నల్లమోతు రాజాబాబు, గ్రామస్తుడు

గర్వంగా ఉంటుంది..



నా కుమారుడు 22 ఏళ్లుగా వివిధ చోట్ల దేశ సరిహద్దుల్లో సైనికుడిగా పని చేస్తున్నాడు. కుమారుడి విధి నిర్వహణలో దేనికైనా సిద్ధంగా ఉన్నాం. కుటుంబానికి దూరంగా పని చేస్తున్నా.. మాలో మనోధైర్యాన్ని నింపుతూ.. దేశ రక్షణకు కృషి చేస్తున్నా నా కుమారుడిని చూస్తుంటే గర్వంగా ఉంటుంది.
– కంచర్ల లాలమ్మ, సైనికుడి తల్లి

సైన్యంలో పని చేసిన సెలవుల్లో వచ్చినప్పుడు పలువురు యువతకు సైన్యంలో పని చేసేందుకు కావాల్సిన లక్షణాలపై అవగాహన కల్పించేవారు. దీంతో గ్రామ యువత సుమారు 20 మంది వరకు భారత సైన్యంలో చేరారు.

ప్రస్తుతం విధుల్లో ఆరుగురు..

కంచర్ల ప్రసాద్ 2002లో ఆర్మీ జవాన్‌గా ఎంపికై ప్రస్తుతం సిక్కిం(చైనా) సరిహద్దులో విధులు నిర్వహిస్తున్నారు. గంగాసాని రాజేష్ బ్లాక్ కమాండోగా మీరట్‌లో బోర్డర్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. అన్నదమ్ములు కొణిదేన రామకృష్ణ, సాంబశివరావు దేశానికి సేవ చేశారు. చేరుకూరి హరిబాబు, శిలివేరు నాగబ్రహ్మం, అమరనేని రాధాకృష్ణ, అమరనేని సతీష్, ఎం.వెంకటకృష్ణ తదితరులు జవాన్లుగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం కంచర్ల ప్రసాద్, అమరనేని సతీష్‌కుమార్, కొణిదేన రామకృష్ణ, కంచర్ల వెంకటేశ్వర్లు, గంగసాని రాజేష్ ఆర్మీ జవాన్లుగా దేశానికి సేవలందిస్తున్నారు.

మాది ప్రజారంజక పాలన...

డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు మేలు జరిగేలా పాలన కొనసాగిస్తున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ వెల్లడించారు. ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే సంక్షేమ పథకాలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అహర్నిశలు శ్రమిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నారని, ఆదివారం నుంచి మరో నాలుగు పథకాలు మొదలుకానున్నాయని తెలిపారు. పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా గ్రామసభలు నిర్వహిస్తుంటే బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పోట్ల నాగేశ్వరరావులు మాట్లాడుతూ అప్పులకుప్పగా రాష్ట్రాన్ని అప్పగించినా రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు మిగతా పథకాలు అమలుచేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, కొత్తా సీతారాములు, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, పాలకుర్తి నాగేశ్వరరావు, ఎండీ వై.పాషా, గజ్జి సూర్యనారాయణ, నరాల నరేష్, బాణాల లక్ష్మణ్, పర్వత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దుర్గాప్రసాద్, పక్కన రాయల, నాయకులు

యాదవుల సమగ్రాభివృద్ధికి కృషి

ఖమ్మంఅర్బన్: యాదవుల సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు కూరాకుల నాగభూషణం వెల్లడించారు. ఖమ్మం శ్రీనగర్‌కాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన తెలంగాణ యాదవ మహాసభ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, పార్టీ పదవుల్లో యాదవులకు సముచిత స్థానం కల్పించాలని, తెలంగాణ మంత్రి వర్గంలోనూ అవకాశం కల్పించాలని కోరారు. కాగా, సమీకృత గొర్రెల మార్కెట్‌కు కేటాయించిన నాలుగున్నర ఎకరాల భూమిని ఇతర అవసరాలకు కేటాయించాలన్న ఆలోచన విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ యాదవ మహాసభ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈమేరకు అధ్యక్షుడిగా కూరాకుల నాగభూషణంతో మహిళా జిల్లా కన్వీనర్‌గా చిత్తారి ఇందుమతి, కార్యదర్శిగా గుమ్మా రోశయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో యాదవ సంఘం నాయకులు పగడాల నాగరాజ్, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, మేకల సుగుణరావు, బారి మల్సూర్, చక్కిలాల మోహన్‌రావు, ముక్కాల కమల, కూరాకుల వలరాజు, ఎర్రబోయిన గోవిందరావు, పాదిల పాపారావు తదితరులు పాల్గొన్నారు.


అధ్యక్షుడు నాగభూషణం తదితరులతో నాయకులు

నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు

ఎనిమిది మంది సభ్యుల్లో ఉమ్మడి జిల్లా వాసులు

వరంగల్ క్రైం: రూ.లక్ష అసలు కరెన్సీకి నాలుగు రెట్లు అధికంగా నకిలీ నోట్లు మార్పిడి చేస్తున్న ముఠా గుట్టురట్టయింది. ఈ ముఠాను వరంగల్ పోలీసులు అరెస్ట్ చేయగా వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా శనివారం వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజరకు చెందిన మణికాల కృష్ణ, నక్రిపేటకు చెందిన ధరమ్‌సోత్ శ్రీను, తేజావత్ శివ, ముల్కలపల్లి మండలం మూకమామిడికి చెందిన గుగులోత్ వీరన్నతో పాటు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కేశవాపూర్‌కు చెందిన ఎర్రగొల్ల శ్రీనివాస్, ఉడుత మల్లేశ్, ఎర్రగొల్ల అజయ్, ఏపీలోని కర్నూలు జిల్లా కుర్విపేట మండలం వేల్పనూర్‌కు చెందిన బిజిని వేముల వెంకటయ్యను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో ప్రధాన నిందితుడైన మణికాల కృష్ణ గొర్రెల వ్యాపారం చేస్తుండగా ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. గొర్రెల వ్యాపారంలో పరిచయమైన వ్యక్తులతో తనకు అడవిలో డబ్బుతో కూడిన డ్రమ్ము దొరికిందని, ఆ డబ్బు వినియోగిస్తే ఆరోగ్య, ఇతర సమస్యలు ఎదురవుతున్నాయని నమ్మించాడు. ఎవరైనా రూ.లక్ష ఇస్తే వారికి రెండింతల డబ్బు ఇస్తానని, అలాగే రూ.లక్ష అసలు ఇస్తే నాలుగు రెట్లు అధికంగా నకిలీ నోట్లు ఇస్తానని చెప్పేవాడు. ఆపై ఎర్రగొల్ల శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడగా కృష్ణకు తొలుత అసలు రూ.500నోట్లు చూపించడంతో మార్పిడి చేసేలా అంగీకారం కుదిరింది. ఆ డబ్బును హనుమకొండలో తనకు ఇవ్వాలని శ్రీనివాస్ సూచించగా కృష్ణ, మరో నలుగురు నిందితులతో కలిసి కారులో శుక్రవారం కేయూసీ ఔటర్ రింగ్ రోడ్డు వద్దకు వచ్చాడు. అక్కడ ఉన్న శ్రీనివాస్ మరో ఇద్దరు నిందితులతో కలిసి కరెన్సీ మార్పిడి చేసుకుంటుండగా పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. కారులో తనిఖీ చేయగా రూ.38.84లక్షల అసలు కరెన్సీ, రూ.21లక్షల నకిలీ నోట్లు, నకిలీ నోట్ల ముద్రణకు అవసరమైన కాగితాలు లభించడంతో విచారించగా నేరం అంగీకరించారు. ప్రధాన నిందితుడైన కృష్ణ ఇదే తరహాలో మరో మిత్రుడితో కలిసి తెల్లకాగితాలపై రూ.500 నోటు ముద్రించి పలుమార్లు మార్పిడి చేస్తూ పోలీసులకు చిక్కడంతో సత్తుపల్లి, వీ.ఎం.బంజర, లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్లు సీపీ తెలిపారు.

సౌకర్యాలు ఎలా ఉన్నాయి?

సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో కేంద్ర బృందం పరిశీలన

నేలకొండపల్లి: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని తమిళనాడుకు చెందిన పాపులేషన్ రీసెర్చ్ బృందం శనివారం మండలంలోని బోదులబండ, నేలకొండపల్లి పీహెచ్‌సీ, సీహెచ్‌సీలను పరిశీలించింది. మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి వచ్చిన వారు ఓపీ రికార్డులతో పాటు ల్యాబ్, ఆపరేషన్ వార్డులు, కాన్పుల గదులను పరిశీలించారు. చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం ప్రతినిధి మురుగేషన్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ఆస్పత్రులను ఐదు రోజుల పాటు తనిఖీలు చేశాక వైద్యసేవలు, కేంద్ర పథకాల అమలుపై నివేదిక రూపొందిచామని తెలిపారు. రీసెర్చ్ ఆఫీసర్ చందన్‌కుమార్, జిల్లా నోడల్ అధికారి దుర్గ, జిల్లా కమ్యూనిటీ అధికారి రఘురాం, వైద్యాధికారులు మంగళ, శ్రీకాంత్, నాగమణి, అర్జున్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అనుమతి లేని ల్యాబ్‌ల సీజ్

బోనకల్: మండల కేంద్రంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మూడు మెడికల్ ల్యాబ్‌లను ఖమ్మం టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపతిరావు ఆధ్వర్యాన శనివారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ల్యాబ్‌లకు ఎలాంటి అనుమతులు లేవని తనిఖీల్లో తేలడంతో గణేష్, మణికంఠ, బిస్మిల్లా ల్యాబ్‌లను సీజ్ చేసి బాధ్యులపై కేసు నమోదు చేశామని తెలిపారు. తనిఖీల్లో మెడికల్ ఆఫీసర్ స్రవంతి, ఎస్‌ఐ మధుబాబు, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ రామారావు పాల్గొన్నారు.

అండర్-17 బాలికల క్రికెట్ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్ర పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఖమ్మంలో మూడు రోజుల జరిగిన రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-17 బాలికల క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈమేరకు జట్ల వారీగా ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్లు టోర్నీ పరిశీలకులు గోపాల్ ప్రకటించారు. రాష్ట్ర జట్టుకు పి.వైష్ణవిరత్న, అనన్య, బి.యమున, బి.యశస్విని, బి.రేవతి(ఖమ్మం), ఎ.అస్విత, కె.ప్రతీక, టి.అనన్య(రంగారెడ్డి), ప్రియాంషి మహారాణా, బి.అస్మితసింగ్(మెదక్), ఆర్.అక్షర, కె.దివ్య(మహబూబ్‌నగర్), డి.సహప్రరాజ్(వరంగల్), అక్షయ లక్ష్మీరెడ్డి(హైదరాబాద్), ఎం.ఐశ్వర్య(నల్లగొండ) ఎంపిక కాగా, త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఈ జట్టు పాల్గొననుంది.

ఫెర్టిలైజర్ దుకాణంలో నగదు చోరీ

వైరా: వైరాలోని ఎస్‌వీ ట్రేడర్స్ ఫర్టిలైజర్ షాపులో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ వెల్లడించిన వివరాలు.. వైరాకు చెందిన కొణతాలపల్లి నగేష్ ఎస్‌వీ ట్రేడర్స్ పేరుతో షాపు నిర్వహిస్తుండగా శనివారం ఉదయం వచ్చి షట్టర్ తీయగా పైభాగం రేకులకు రంధ్రం కనిపించింది. దీంతో సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిద్దామనే సరికి క్యాష్ బాక్స్ పగలగొట్టిఉంది. బాక్స్‌లో ఉండాల్సిన రూ.3.20లక్షల నగదు లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ నేతృత్వాన క్లూస్ టీమ్ చేరుకుని విచారణ చేపట్టారు.

ఖైదీలకు ఉచిత న్యాయసాయం

ఖమ్మంలీగల్: ఖైదీలకు ఉచిత న్యాయసాయం అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని జైళ్ల శాఖ వరంగల్ డీఐజీ సంపత్ తెలిపారు. జిల్లా జైలులో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన శనివారం సదస్సు ఏర్పాటుచేయగా ఆయన మాట్లాడారు. ఖైదీలకు ఉచిత న్యాయసాయం అందించడానికి న్యాయసేవాధికార సంస్థతో కలిసి లీగల్ ఎయిడ్ కౌన్సిళ్లు, జైలు అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. ట్రెయినీ ఐపీఎస్ రుత్విక్ సాయి, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ మామిడి హన్మంతరావు, న్యాయవాదులు ఇమ్మడి లక్ష్మీనారాయణ, పాలిశెట్టి పద్మావతి, శ్రీనివాసరావు గుప్తా మాట్లాడగా జైలు సూపరింటెండెంట్ శ్రీధర్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఎండిపోతున్న పంటను కాపాడండి

కామేపల్లి: రెండెకరాల మిరప చేను ఎండిపోయే దశలో ఉందని రైతు దంపతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మండలంలోని బర్లగూడెంకు చెందిన లూనావత్ చిన్నానాయక్, భారతి శనివారం తాళ్లగూడెంలో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. భూతగాదాల నేపథ్యాన తన సోదరులు, వారి కుమారులు పైపులను ధ్వంసం చేయడంతో మిరప తోటకు నీరు అందక ఎండిపోతోందన్నారు. పక్క రైతు బోరు నుంచి పైపులు ఏర్పాటు చేసుకున్నా బెదిరిస్తున్నారని, ఈ విషయమై తాము పోలీసులను ఆశ్రయిస్తే కొందరి ప్రోద్బలంతో తమపైనే కేసు పెట్టించారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు తమకు న్యాయం చేయాలని చిన్నానాయక్ దంపతులు కోరారు.